సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం | 6 | మే | 2024



పాలించే హక్కు కాంగ్రెస్‌కే ఉంది
తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే హక్కు కాంగ్రెస్‌కే ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. - IIలో



హామీల అమలులో విఫలం
హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - IIIలో

గరిష్ఠం / కనిష్ఠం
43^{0} / 29^{0}

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



రాయగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎన్నికల పరిశీలకుడు

భువనగిరి క్రైం : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో 10,50 పోలింగ్ కేంద్రాలను ఆదివారం కేంద్ర ఎన్నికల పరిశీలకుడు నవీన్ సైనిక సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఓటర్లు స్వేచ్ఛాయుత నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో ఆత్మస్థైర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట భువనగిరి రూరల్ ఎస్సై సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్



భువనగిరిలోని వెన్నెల ఇంజనీరింగ్ కాలేజీలో ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు

భువనగిరిటౌన్ : పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ వ్యాప్తంగా 1,167 మంది ఉద్యోగులు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంటి వద్ద నుంచి 309 మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేశారు. భువనగిరిలోని వెన్నెల ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సందర్శించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరగాలని ఎన్నికల అధికారికి చూసించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులంతా ఈ నెల 8 వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు



పంతంగి చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న వ్యయ పరిశీలకుడు

చౌటుప్పల్ : మండల పరిధిలో జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు కుమార్ రాజేష్‌రంజన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం చౌటుప్పల్ పట్టణంలో ప్రాథమికోన్నత పాఠశాల ఓటర్లతో సమావేశమయ్యారు. ఓటు ఆవశ్యకతను వివరించారు. విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అలాగే తూప్రాన్‌పేట చెక్‌పోస్టును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవారికి ఆరాధన, నిజాభిషేకం, అర్చనలు చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవను ఊరేగించారు.

ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి

ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు
- ఉపాధి పనుల ప్రదేశాలకు వెళ్లి కూలీలకు అవగాహన
- విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సంకల్ప్ పత్రాల స్వీకరణ
- స్వయం సహాయక బృందాల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సదస్సులు
- జన సమ్మర్ధ ప్రాంతాల్లో కళాకారులతో ప్రదర్శనలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే. జెండగే



సాక్షి ఇంటర్వ్యూలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, హనుమంతు కే. జెండగే

సాక్షి, యాదాద్రి : 'భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఇందుకోసం క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన, ఓటరు చైతన్య నిర్వహిస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది. మే13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి' అని అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. పోలింగ్ శాతం పెంపునకు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి' ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆయన మాటల్లోనే..

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి 39వేల సంకల్ప్ పత్రాలు
ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఇందుకోసం పాఠశాలల్లో చదవే విద్యార్థుల తల్లిదండ్రులు 39 వేల మంది నుంచి సంకల్ప్ పత్రాలు తీసుకున్నాం. దీని ద్వారా వారంతా తప్పనిసరిగా ఓటు వేస్తారని ఎన్నికల కమిషన్ భావిస్తోంది.

లక్ష మంది కూలీలకు అవగాహన
ఓటింగ్ శాతం పెంచడానికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాలకు అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సుమారు లక్ష మంది కూలీలను కలిసి అవగాహన కల్పించాం. దీంతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు స్వయం సహాయక బృందాల సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యపరుస్తున్నాం. సుమారు 33వేల మందికి అవగాహన కల్పించాం.

దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటు వేసిన అనంతరం తిరిగి ఇళ్లకు చేర్చడానికి వాహనాలు ఏర్పాటు చేస్తాం అలాగే పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వీల్‌చైర్లను అందుబాటులో ఉంచనున్నాం. వారికి సహాయకులుగా వలంటీర్లను నియమిస్తున్నాం. దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఈనెల 3 నుంచి హోం ఓటింగ్ మొదలైంది.

ఇంటి వద్దకే పోల్ చిట్టీలు
బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లకు పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు ఓటు ఆవశ్యకతను తెలియపరుస్తూ కరపత్రాలు కూడా పంపిణీ చేస్తున్నాం.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు
పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తున్నాం. నీడ, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఓఆర్‌ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాం.వైద్య సిబ్బందిని నియమిస్తున్నాం.

పోలింగ్ సమయం పెంపు
వేసవి దృష్ట్యా కేంద్రం ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని పెంచింది. ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ముమ్మరంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు
ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా భువనగిరిలో 5కే రన్ నిర్వహించా. రంగోలి పోటీలు, హైస్కూల్, కళాశాల స్థాయిలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించాం. ఓటు ఆవశ్యతను తెలియజేస్తూ మార్కెట్ యార్డులు తదితర జన సమ్మర్ధ ప్రాంతాల్లో కళాబృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కార్మికులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లల్లోనూ చైతన్యం తీసుకువస్తున్నాం.

తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 92 శాతం పోలింగ్ నమోదైంది. అంతకు మించి ఎక్కువగా పోలింగ్ జరగానికి ప్రయత్నిస్తున్నాం. అందులో భాగంగా తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు, భువనగిరి, రామన్నపేట పరిధిలోని 22 పోలింగ్ కేంద్రాల్లో 67శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ పోలింగ్ శాతం పెంచేందుకు బూత్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగామన కల్పించాం. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ నమోదవుతోంది. దీన్ని ఈసారి ఎన్నికల్లో అధిగమిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తున్నాం.

నేడు చౌటుప్పల్‌లో బీజేపీ సభ



తంగడపల్లిలోని సభా స్థలిలో కొనసాగుతున్న ఏర్పాట్లు

- హాజరుకానున్న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- ఏర్పాట్లలో నిమగ్నమైన పార్టీ యంత్రాంగం

చౌటుప్పల్ : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ మరింత దూకుడు పెంచింది. ఇప్పటికే రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తుండగా.. సోమవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లిలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి ఫిజికల్ ఎడుకేషన్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నేతలు.. బహిరంగసభకు 60వేల నుంచి 80వేల మందిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం కానుంది. నిర్ణీత సమయానికి ముందే నడ్డా హెలికాప్టర్‌లో చౌటుప్పల్ చేరుకోనున్నారు. సభా ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, లోక్‌సభ ప్రభారీ పాపారావు ఆదివారం పరిశీలించారు. ఇదిలా ఉండగా నల్లగొండ, భువనగిరి ఎంపీ నియోజకవర్గాలకు సంబంధించి చౌటుప్పల్‌లో ఈ నెల మొదటి వారంలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈసభకు ప్రధాని మోదీ హాజరుకావాల్సి ఉంది. కానీ, వివిధ కారణాలతో ఆయన పర్యటన రద్దు కావడంతో.. జెపీ నడ్డా ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నారు.

సభను విజయవంతం చేయాలి
కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, దోనూరి వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కోరారు.

ప్రశాంతంగా 'నీట్'

- నల్లగొండలో 2,318, సూర్యాపేటలో 997 మంది హాజరు

నల్లగొండ, సూర్యాపేట టౌన్ : నల్లగొండ, సూర్యాపేటలో ఆదివారం జరిగిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 2,262 మంది విద్యార్థులకు గాను 2,318 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశారు. 1,028 మంది విద్యార్థులకు 997 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులను మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేశారు. వేలిముద్రలు, ఫొటోలు తీసుకున్న అనంతరమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. కొన్ని సెంటర్లలో విద్యార్థినుల చెవిదిద్దులు తీయించి లోపలికి పంపారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాలి, వాన బీభత్సం



సంస్థాన్ నారాయణపురంలో ఈదురుగాలులకు నేలమట్టమైన కోళ్ల షెడ్డు

- పలుచోట్ల విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- నేలరాలిన మామిడి కాయలు
- సంస్థాన్ నారాయణపురంలో నేలమట్టమైన కోళ్ల షెడ్డు
- పిడుగుపాటుకు కోటమర్తిలో వ్యక్తి మృతి
- మూగజీవాలు మృత్యువాత

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉప్పల కృష్ణకు చెందిన కోళ్ల షెడ్లు ఒకటి నేలమట్టం కాగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది. దేశడి నరేందర్‌రెడ్డి పశువుల షెడ్డు ధ్వంసమైంది. ఇదే మండలానికి చెందిన వెంకబావితండాలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గాంధీనగర్‌తండాలో కరెంట్ సరాఫరా నిలిచిపోయింది. గుజ్జ గ్రామంలో చాపల వెంకటేష్‌కు చెందిన రెండు ఎద్దులు పిడుగుపాటుకు మృతిచెందాయి. బాధితుల ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకులు దోనూరి నర్సిరెడ్డి, వెంకబావితండా మాజీ సర్పంచ్ పానుగోతు పాండురంగం, లంబాడీ హక్కుల రాష్ట్ర నాయకుడు జలంధర్‌నాయక్ కోరారు.

- గుండాల మండలంలోని తుర్కలషాపురంలో జక్కుల యాదయ్యకు చెందిన రూ.80వేలు విలువ చేసే పాడి గేదె పిడుగుపాటుకు గురై మృతి చెందింది. పలు గ్రామాల్లో మామిడి మామిడి కాయలు నేల రాలాయి. విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- చౌటుప్పల్ మండలం ఎనగండితండాలో ఐదారు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- అడ్డగూడూరు మండలంలోని కోటమర్తికి చెందిన చిప్పలపల్లి బాలమల్లు (65) పిడుగుపాటుకు గురై ప్రాణాలు విడిచాడు. బాలమల్లు తన వ్యవసాయ బావి వద్ద కొట్టంలో పశువులను కట్టేస్తుండగా కొట్టంపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక గేదె కూడా మృత్యువాత పడింది. పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. గాలికి ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి.
- మోత్కూరు పట్టణంలో స్తంభాలు విరిగిపడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అలాగే మోత్కూరులోని కొత్త బస్టాండ్ వద్ద కంచర్ల మోహన్‌రెడ్డి, జామచెట్ల బావి గ్రామంలో మల్లయ్య, కొండగడపలో తొంట నరేష్‌కు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. నరేష్ ఇంట్లో సామగ్రి వర్షానికి తడిసి ముద్దయ్యింది.
- వలిగొండ మండలం వెంకటాపురంలో జక్కుల కృష్ణ వ్యవసాయ బావి పిడుగుపడి పాడి ఆవు మృతి చెందింది. దీని విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అలాగే నాగారం, అరూరు తదితర గ్రామాల్లో నష్టం వాటిల్లింది.
- ఆత్మకూర్(ఎం) మండలంలోని పారుపల్లిలో బద్దిపడుగు మల్లారెడ్డి ఆవు పడిగుపడి మృతి చెందింది. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిశాయి.

ఉదయం ఎండ.. సాయంత్రం కూల్
భువనగిరిటౌన్ : జిల్లాను ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఇప్పటి వరకు అత్యధికంగా 45.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఆదివారం రికార్డు స్థాయిలో యాదగిరిగుట్టలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. గడిచిన కొన్నేళ్లలో ఇదే అత్యధికంగా వాతావరణ శాఖ లెక్కలు చెబుతున్నాయి. అలాగే ఆత్మకూర్ (ఎం)లో 45.2, బొమ్మలరామారం మండలం 44.3, వలిగొండ, భువనగిరి, రాజాపేటలో 43.5 డిగ్రీల ఎండ కాసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిపోయిన జనం.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.



గుండాల మండలం బ్రాహ్మణపల్లిలో నేలరాలిన మామిడి కాయలు



మోత్కూరులో కంచర్ల మోహన్‌రెడ్డి ఇంటి పైకప్పు లేచిపోయిన దృశ్యం

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు

- నేటి నుంచి తొలి విడత రిజిస్ట్రేషన్లు
- ఎంజీయూ పరిధిలో 26,040 సీట్లు



భువనగిరి: డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు తొలి విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 75 కాలేజీలు, వాటిలో 26,040 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఫస్టియర్‌లో ప్రవేశం కోసం హాల్ టికెట్ నంబర్‌తో దోస్త్ వెబ్‌సైట్ https://gg.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

మూడు విడతల్లో సీట్ల కేటాయింపు
మూడు విడతల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. విద్యార్థులు రూ.200 రుసుము చెల్లించి రాష్ట్రంలో నచ్చిన కాలేజీలో సీటు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈనెల 15 నుంచి 27వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 3న తొలి విడత సీట్లు కేటాయిస్తారు. జూన్ 4 నుంచి 10 మధ్యలో సెల్ఫ్ రిపోర్టు చేయాలి. రూ.400 రుసుముతో జూన్ 4నుంచి 13వ తేదీ వరకు రెండో దశ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూన్ 4 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంది. జూన్ 18న సీట్ల కేటాయింపు, 19 నుంచి 24వ తేదీ మధ్య రిపోర్ట్ చేయాలి. మూడో దశలో జూన్ 19 నుంచి25వ తేదీ వరకు రూ.400 రుసుముతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూన్ 19 నుంచి 26వ వరకు వెబ్ ఆప్షన్లు..జూన్ 29న సీట్లు కేటాయిస్తారు. జూన్ 29 నుంచి జూలై 3 మధ్యలో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి.

జూలై 8నుంచి తరగతులు
సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 5వ తేదీ మధ్య కళాశాలల్లో రిపోర్టు చేయాలి. జూలై 8 నుంచి తరగుతులు ప్రారంభం కానున్నాయి.

కొత్త కోర్సులు ఇవీ..
డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బీకామ్ ఫైనాన్స్, బీఎస్సీ బయో మెడికల్ సైన్స్, బీఏ స్పెషల్, బీఏ పబ్లిక్ పాలసీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

ఎంజీయూ పరిధిలో ఇలా..

విద్యాసంస్థలు	కాలేజీలు	సీట్లు
ప్రభుత్వ	11	6,120
ఎయిడెడ్	02	1,260
ప్రైవేట్	62	18,660
మొత్తం	75	26,040

మూడుసార్లు.. ఆ నలుగురు

- నల్లగొండ, మిర్యాలగూడ ఎంపీలుగా జీఎస్.రెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బద్దం నర్సింహారెడ్డి విజయం
- రద్దయిన మిర్యాలగూడ నుంచి జీఎస్.రెడ్డి, భీమిరెడ్డి, బద్దం గెలుపు
- నల్లగొండ నుంచి మూడు పర్యాయాలు గుత్తా సుఖేందర్‌రెడ్డి
- ఎవరికీ దక్కని హ్యాట్రిక్ విజయం



భీమిరెడ్డి నర్సింహారెడ్డి



సుఖేందర్‌రెడ్డి



బద్దం నర్సింహారెడ్డి



జీఎస్. రెడ్డి

సాక్షిప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇన్నేళ్ల ఎన్నికల చరిత్రలో నలుగురు నేతలు మాత్రమే మూడుసార్లు ఎంపీలుగా విజయం సాధించారు. నల్లగొండ నియోజకవర్గానికి 1952 నుంచి ఎన్నికలు జరుగుతుండగా, 1962 నుంచి 2004 వరకు మిర్యాలగూడ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మిర్యాలగూడ రద్దయ్యింది. మిర్యాలగూడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు కొన్ని నల్లగొండ పరిధిలోకి రాగా, మిర్యాలగూడలోని నియోజకవర్గాలతోపాటు పూర్వపు వరంగల్ జిల్లాలోని జనగామ, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్లతో కలిపి 2009లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు మూడుసార్లు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు నాలుగో సారి ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే నల్లగొండ, పాత మిర్యాలగూడ, ప్రస్తుత భువనగిరి నియోజకవర్గాల్లో ఇప్పటివరకు నలుగురు నేతలు ఒక్కొక్కరు మూడుసార్లు ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

మిర్యాలగూడ నుంచి మరో ముగ్గురు
మిర్యాలగూడ పార్లమెంట్ నియోజకవర్గంలో పన్నెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్యే కొనసాగింది. ఈ నియోజకవర్గం నుంచి ముగ్గురు నేతలు మూడుసార్లు గెలిచారు. 1971 ఎన్నికల్లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి సీపీఎం నుంచి పోటీ చేసి తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) అభ్యర్థి కె.జితేందర్‌రెడ్డిపై మొదటిసారి గెలిచారు. ఆ తర్వాత 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చకిలం శ్రీనివాసరావుపై, 1991 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బద్దం నర్సింహారెడ్డిపై విజయం సాధించి ఈ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జీఎస్.రెడ్డి 1967 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి డీవీ.రావుపై మొదటిసారి విజయం సాధించారు. మళ్లీ ఆయనే 1977, 1980 ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి భీమిరెడ్డి నర్సింహారెడ్డిపై గెలిచారు. ఇక 1989లో కాంగ్రెస్ నుంచి బద్దం నర్సింహారెడ్డి మొదటిసారి సీపీఎం అభ్యర్థి భీమిరెడ్డి నర్సింహారెడ్డిపై గెలుపొందారు. 1996, 1998లోనూ మరో రెండుస్లారు బద్దం నర్సింహారెడ్డి గెలుపొందారు.

రెండుసార్లు విజయం సాధించింది వీరే..
మిర్యాలగూడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఎస్.జైపాల్‌రెడ్డి రెండుసార్లు గెలుపొందారు. ఇక నల్లగొండ నియోజకవర్గం నుంచి రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డి రెండుస్లారు గెలుపొందారు. ఈ ముగ్గరూ సీపీఐ నేతలు కావడం గమనార్హం.

మూడుసార్లు గెలిచిన ఘనత నలుగురికే..
వర్తమాన రాజకీయాల్లో జిల్లాలో మూడుసార్లు గెలిచిన ఘనతను సాధించింది గుత్తా సుఖేందర్‌రెడ్డి ఒక్కరే కావడం విశేషం. పైగా పూర్తి కాలం ఎంపీగా ఆయన కొనసాగారు. ఆయన నల్లగొండ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలిచి రికార్డు సృష్టించారు. టీడీపీ తరఫున 1999 ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కనుకుల జనార్దన్‌రెడ్డిపై 79,735 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. తరువాత ఆయన టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి సురవరం సుధాకర్‌రెడ్డిపై విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచే రెండోసారి 2014 ఎన్నికల్లో బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థి తేరా చిన్నపరెడ్డిపై 1,93,156 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి కేవలం సుఖేందర్‌రెడ్డి మాత్రమే మూడుసార్లు గెలిచారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల కమిషనింగ్‌ను కలెక్టర్ దాసరి హరిచందన ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని నాగార్జున కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూంలో జరుగుతున్న ఈవీఎం కమిషనింగ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె కమిషనింగ్ చేస్తున్న సందర్భంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయా అనే విషయాలను సెక్టోరల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ.. చాయ్ పోస్తూ...



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి



చాయ్ పోస్తున్న కంచర్ల కృష్ణారెడ్డి

ఆ మూడు పార్టీలకు గుణపాఠం చెప్పాలి



ప్రచారంలో పాల్గొన్న సిరిపంగి నర్సింహ, ఎంపీ అభ్యర్థి కదిరే కిరణ్‌కుమార్

నకిరేకల్ : మోసపూరితమైన హామీలు ఇచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజల ఓట్లతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బహుజన రిపబ్లిక్ సోషలిస్ట్ పార్టీ (బీఆర్‌ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు సిరుపంగి నర్సింహ, పార్టీ ఎంపీ అభ్యర్థి కదిరే కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ ఎంపీ అభ్యర్థి కదిరె కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుడిగే రాజే, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణగౌడ్, కత్తుల రవీందర్, బొజ్జ నర్సింహ, నగేష్, శ్రీకాంత్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా సానుకులంగా స్పందించారని తెలిపారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పసల మరియదాస్, కందుల సోమయ్య, సంఘం ప్రతినిధులు శంకర్‌రెడ్డి, వీరమల్ల రవీందర్, బొబ్బలి శేఖర్‌రెడ్డి, బాదిని లింగయ్య, శివకోటి అంజనేయులు ఉన్నారు.

అరచేతిలో ఎన్నికల సమాచారం

- ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు
- ప్రత్యేక మొబైల్ యాప్‌లు అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల కమిషన్
- వేగంగా ఫిర్యాదుల పరిష్కారం



పెద్దవూర : టెక్నాలజీ ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ఓటరుకు అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యం పెంచేందుకు వివిధ రకాల మొబైల్ యాప్‌లను ప్రవేశపెట్టింది. ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి గురించి తెలుసుకోవాలన్నా.. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు చేయాలన్నా ప్లే స్టోర్‌లో ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి తీసుకువచ్చింది. సువిధ, సీ–విజిల్, కేవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం, ఓటరు హెల్ప్ వంటి యాప్‌లతోపాటు నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి, ఓటర్లకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్‌లను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని యాప్‌లు ప్లే స్టోర్‌లో లభ్యమవుతున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అభ్యర్థులకు ఉపయోగకరంగా సువిధ యాప్..

ఈ యాప్‌లో అభ్యర్థులు రిజిస్టర్ చేసుకుని, వారి ఆధారాలతో లాగిన్ కావాలి. సువిధ యాప్ అభ్యర్థులకు అవసరమైన అనేక ఫీచర్లు అందిస్తోంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

పోలింగ్ సరళి కోసం 'ఓటర్ టర్న్ అవుట్'

పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ఓటర్ టర్న్ అవుట్ యాప్‌ను సిద్ధం చేసింది. పోలింగ్ వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. జిల్లా, నియోజకవర్గాల వారీగా వివరాలు తెలుసుకోవచ్చు.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎన్నికల కమిషన్‌కు సహాయపడడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుంది. ఓటరు తన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. అలాగే ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. నిర్ణీత వ్యవధిలోగా ఎన్నికల అధికారి స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారు. పోలింగ్ బూత్‌లో సమస్యలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో సమస్యలు, ఎన్నికల ఖర్చు, అక్రమాలు వంటి ఫిర్యాదులను ఈ యాప్ ద్వారా పోస్టాట్ చేయవచ్చు. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా ఈ యాప్‌లో పరిశీలించవచ్చు.

అబ్జర్వర్


ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకునేందుకు వీలుగా అబ్జర్వర్‌లకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. దీనిని ఉపయోగించేందుకు ఎన్నికల పరిశీలకులు ముందుగా లాగిన్ క్రియేట్ చేసుకుని, వారి పాస్‌వర్డ్‌తో సమాచారం అందించాలి. అక్రమాలను అరికట్టేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుంది. తమ నియోజవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారం పొందవచ్చు. ఓటర్లు ఆయా యాప్‌లను ఉపయోగించుకుని ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

'సీ-విజిల్'తో అక్రమాలకు అడ్డుకట్ట



ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. ఆడియో, వీడియో, ఫొటో ఏదో ఒక సాక్ష్యం యాప్‌లో పోస్ట్ చేస్తే అధికారులు స్పందించి తగు చర్యలు చేపడతారు. ఎవరు కోడ్ ఉల్లంఘించినా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియో క్లిప్‌గా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. యాప్ ఓపెన్ చేయగానే ఫొటో, వీడియో ఆప్షన్లు ఉంటాయి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించి పోస్ట్ చేయాలి. అధికారులు తక్షణం స్పందించి అక్రమాలను అరికట్టేందుకు కృషి చేస్తారు.

అభ్యర్థుల వివరాల కోసం కేవైసీ యాప్



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. క్రిమినల్ కేసులు, వాటి స్థితి, నేరాల స్వభావం వంటి వివరాలు ఇందులో ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు ఈ యాప్ ఓటర్లకు సహాయపడుతుంది.

వృద్ధులు, దివ్యాంగులకు 'సాక్ష్యం'యాప్



పోలింగ్ రోజున వీల్‌చైర్ కోరేందుకు, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుసుకునేందుకు దివ్యాంగులకు తోడ్పడేలా సాక్ష్యం యాప్‌లో అనేక ఫీచర్లు అందుబాటులో ఉంచారు. ఈ యాప్ దృష్టి లోపం ఉన్న దివ్యాంగులకు వాయిస్ సహాయం అందిస్తుంది. టెక్స్ట్ టు స్పీచ్ సదుపాయం కూడా ఉంది.

ఓటర్ 'హెల్ప్‌లైన్'..



ఎలక్ట్రోరల్ రోల్‌లో ఓటరు పేరు సెర్చ్ చేయడం, ఓటు వేసేందుకు అర్హత ఉందో లేదో నిర్ధారించుకునేందుకు ఈ యాప్‌ను ఉపయోగించవచ్చు. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తల అప్‌డేట్ పొందవచ్చు.

కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



దిర్శించర్లలో మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని దిర్శించర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రి అయ్యి ఉండి సాగర్ డ్యాంలో సరిపడా నీరుండి ఆయకట్టు ఎండుతున్నా పంటలను కాపాడలేకపోయారన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు, రుణమాఫీ చేయలేకపోయారని అన్నారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేకపోయారని అన్నారు. సమావేశంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబంది సురేష్‌బాబు, చెన్నబోయిన సైదులు, పంగ శ్రీను, రాపోలు నవీన్, లింగయ్య, తదితరులు ఉన్నారు.

తెలంగాణను పాలించే హక్కు కాంగ్రెస్‌కే ఉంది



చౌటుప్పల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే హక్కు కాంగ్రెస్‌కే ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో మున్సిపాలిటీ, మండలానికి చెందిన బూత్ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్షను గౌరవించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా పాలించే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామంటూ పదేపదే అంటున్న బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగయ్యే స్థితికి చేరిందన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిని గెలిపించి తీసుకువస్తానని సీఎం రేవంత్‌రెడ్డికి మాట ఇచ్చానని అన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కై లాష్‌నేత, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, బ్లాక్, మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, బోయ దేవేందర్, నాయకులు పబ్బు రాజు, చెన్నగోని అంజయ్య, గుండు మల్లయ్య, చింతల వె ంకట్‌రెడ్డి, రాంచంద్రం, ఎండీ.హన్నుభాయ్, చిట్టంపల్లి శ్రీనివాస్, జంగయ్య, శ్రీనాథ్, శ్రీనివాస్, రమేష్, బాబాషరీఫ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



కట్టంగూర్ : ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కట్టంగూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రోడ్‌షోలో ఆయన మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకర బోయిన నర్సింహ, మాద యాదగిరి, దైద రవీందర్, మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పెద్ది యాదగిరి, కొండ లింగస్వామి, రెడ్డిపల్లి సాగర్, ధార భిక్షం, మాద లింగస్వామి, శేఖర్, వెంకటేశ్వర్లు, సైదులు, అంజయ్య, నారాయణ, వెంకన్న, అనిల్‌రెడ్డి, జానయ్య, నర్సింహ ఉన్నారు.

ద్వంద్వ పౌరసత్వం కల్పించేందుకు కృషి

- ఎన్నారైల జూమ్ మీటింగ్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



నాగార్జునసాగర్ : జూమ్ మీటింగ్‌లో ఎన్నారైలతో మాట్లాడుతున్న జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్

నాగార్జునసాగర్ : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రవాస భారతీయులకు ద్వంద్వ పౌరసత్వం కల్పించేందుకు కృషి చేస్తామని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నాగార్జునసాగర్‌లోని తమ నివాసంలో ప్రపంచంలోని ప్రవాస తెలంగాణీయులతో ఎన్నారైలు గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, నాగబోయిన శ్రీను, నెమలి మాధవరెడ్డిలు ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రవాసీయుల సహకారంతో నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని మోడల్‌గా తయారు చేయనున్నట్లు తెలిపారు. ప్రవాసీ తెలంగాణ భవన్ నిర్మాణానికి భూమి కేటాయించేందుకు ప్రయత్నిస్తామని, గ్రామాల్లో కార్పొరేట్ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గల్ఫ్ కార్మికుల రక్షణకు నూతన చట్టాలను తేవడంతో పాటు నదీజలాల విషయంలో విభజన హామీలను అమలు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ మీటింగ్‌లో పలువురు ఎన్నారైలు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పార్లమెంట్ ఎన్నికల్లో కుందూరు రఘువీర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి తన కీర్తి ప్రతిష్టలను పెంచాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని అల్వాల ఎక్స్‌రోడ్ నుంచి మండల కేంద్రం వరకు చేపట్టిన రోడ్‌షోలో స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి జానారెడ్డి పాల్గొని మాట్లాడారు. తిరుమలగిరి మండలంలోని సాగుకు నోచుకోని 24వేల ఎకరాలకు రానున్న ఐదు సంవత్సరాల కాలంలో సాగు నీరందిస్తానన్నారు. నాలుగు విడతల్లో నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని, మొదటి విడతను రానున్న సంవత్సరంలో 24వేల ఎకరాలకు సాగునీరందిస్తానని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు నెలల కాలంలోనే తిరుమలగిరి మండలానికి రూ.300కోట్లు నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్ మాట్లాడారు. తనను ఎంపీగా గెలిపిస్తే నాగార్జునసాగర్ యువత కోసం రెండు పరిశ్రమలను నియోజకవర్గానికి తీసుకువచ్చే బాధ్యత తమదేనన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎంపీపీ భగవాన్‌నాయక్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ లింగారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణానాయక్, సాగర్ రెడ్డి, చంద్రశేఖర్, చవ్వ బ్రహ్మానందరెడ్డి, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెబితేనే ప్రజాస్వామ్య మనుగడ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

చండూరు(గట్టుప్పల్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పినప్పుడే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్పల్లిలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే మోదీ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తాడని అన్నారు. మోసపూరిత మాటలు, మతం, దేవుళ్ల సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెట్టి మోసగించి మరోసారి అధికారంలోకి రావాలని మోదీ చూస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, వివిధ మండలాల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, నాయకులు శివకుమార్, ధనంజయ గౌడ్, శ్రీను, శ్రీశైలం పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు, గురుజాల గ్రామాల్లో వడదెబ్బకు గురై శనివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూరు గ్రామానికి చెందిన రావుల యాదమ్మ(65), గురుజాల గ్రామానికి చెందిన సుల్తాన్ యల్లయ్య(60) శనివారం ఉపాధి పనులకు వెళ్లారు. రాత్రి ఇంటి వద్ద అస్వస్థతకు గురికావడంతో వైద్యం కోసం తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందారు.

ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం

బీబీనగర్ : ఉరివేసుకొని ఓయువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని గూడూరు గ్రామంలో తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జుర్రు రాము(40) వ్యవసాయం చేసుకుంటూ పాడిగేదెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. కాగా రాము కుమారుడు అనారోగ్యంతో 3నెలల క్రితం మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి రాము మానసికంగా కుమిలిపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో చనిపోవాలని నిర్ణయించుకుని ఆదివారం తెల్లవారుజామున తన వ్యవసాయి బావి వద్ద గెదేల షెడ్‌లో తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అటు వెళ్లిన స్థానికులు గమనించి పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ 2 అమర్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వలిగొండ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుప్పెల్లికి చెందిన గాదగోని రోశయ్య (45) హైదరాబాదులో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. ఇంటికి వాటర్ క్యూరింగ్ చేసేక్రమంలో విద్యుత్ మోటార్‌కు పైపు తొడిగే సమయంలో ప్రమాదవశాత్తు రోశయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

సూర్యాపేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు దాసరి మల్లయ్య(60) వ్యవసాయ పనులు ముగియడంతో కొన్ని రోజులుగా గేదెలను కాస్తున్నాడు. ఆదివారం చెరువు సమీపంలో గేదెలు కాస్తున్న క్రమంలో గేదెలు చెరువులోకి దిగాయి. వాటిని బయటకు తరలించే క్రమంలో మల్లయ్య చెరువులోకి దిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అక్రమ వసూలుకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

నల్లగొండ క్రైం/ కేతేపల్లి : అక్రమ వసూలుకు పాల్పడిన కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ పి.మహేష్‌ను సస్పెండ్ చేస్తూ నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. గత నెల 28న 65వనంబరు జాతీయ రహదారిపై కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ కారును తనిఖీ చేయగా అందులో తొమ్మిది బీరు సీసాలను పోలీసులు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేస్తామని కారులోని వ్యక్తులను సదరు కానిస్టేబుల్ బెదిరించి రూ.6వేలను సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ సిబ్బందికి ఫోన్‌పే చేయించుకున్నాడు. అనంతరం ఈ విషయమై బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్పీ శాఖాపరమైన విచారణ జరిపించారు. కానిస్టేబుల్ మహేష్ అక్రమ వసూలుకు పాల్పడ్డాడని నిర్ధారణ కావడంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

మధుయాష్కిగౌడ్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

ఆలేరు రూరల్ : టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. మాజీ ఎంపీ బలరాంనాయక్ తల్లి మరణించడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం మధుయాష్కిగౌడ్ హైదరాబాద్ నుంచి వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో ఆలేరు వద్దకు రాగానే బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు రోడ్డు క్రాస్ చేస్తూ మధుయాష్కిగౌడ్ ప్రయాణిస్తున్న కారుకు అడ్డుగా వచ్చారు. కారును డ్రైవర్ ముఖేష్ పక్కకు తిప్పడంతో డివైడర్‌ను ఢీ కొట్టి కారు టైర్లు పేలిపోయాయి. ఈ ఘటనలో మధుయాష్కిగౌడ్‌కు, కారులోని పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

యాదాద్రీశుడి క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ ముఖ మండపంలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి ఆదివారం భక్తులు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ మాడ వీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాలలు భక్తులతో కిటకిటలాడారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ధర్మ దర్శనానికి సుమారు మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కొండ కింద, కొండపైన బస్టాండ్లు, ముఖ మండపం, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట వద్ద భారీగా భక్తుల సందడి నెలకొంది. వివిధ పూజల ద్వారా నిత్య ఆదాయం రూ.53,32,909 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

యాదాద్రిలో ప్రముఖుల పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ రాజేంద్ర విజయ్, టీఎస్‌ఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

సైడ్ ఇవ్వలేదని బస్సు డ్రైవర్‌పై రాయితో దాడి

మోత్కూర్ : బైక్‌కు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను రాయితో కొట్టాడు ఓ వ్యక్తి. ఈ ఘటన ఆదివారం రాత్రి మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో జరిగింది. వివరాలు.. మోత్కూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి నల్లగొండ డిపోకు చెందిన బస్సు ఆదివారం రాత్రి నల్లగొండకు వెళుతోంది. ఈ క్రమంలో బస్సు మున్సిపల్ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్దకు రాగానే మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున రోడ్డు ఇరుకుగా మారడం, వర్షం కురిసి వరద నీరు రోడ్డుపై పారుతుండడంతో సైడ్ ఇచ్చే అవకాశం లేకపోవడంతో కొంచెం ఆగమని బస్సు డ్రైవర్ సిగ్నల్ ఇచ్చాడు. అయినా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి బస్సును ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నిస్తూ డ్రైవర్‌ను బూతులు తిట్టసాగాడు. అంబేడ్కర్ చౌరస్తాలో బస్సుకు అడ్డంగా బైకు పెట్టి రాయి తీసుకుని బస్సు ఎక్కి డ్రైవర్ శివరాత్రి ధనుంజయను తలపై కొట్టాడు. డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బస్సు డ్రైవర్‌కు స్థానిక ఆస్పత్రిలో వైద్యం చేయించారు.